# స్వభావాలు

ఇలపావులూరి మురళీమోహనరావు

సాయంత్రం నాలుగు గంటలకు పెళ్ళి వారి బస్సు బయలుదేరింది. నేనూ, నా భార్య ముందు వరుస సీట్లలో సుఖాసీనుల మయ్యాము. పెళ్ళి కూతురు వాళ్ళది రాజమండ్రి దగ్గర ఒక చిన్న పల్లెటూరు. పల్లెల మీద నా కున్న సహజమైన అనురాగం నే నీ పెళ్ళికి కుటుంబ సమేతంగా వెళ్ళటానికి దోహదం చేసింది.

గత పది సంవత్సరాలుగా ఉద్యోగ రీత్యా హైదరాబాదులో ఉంటున్నాను. అంతకు ముందు ఇరవై సంవత్సరాలు పల్లెటూర్లో పెరిగాను. అక్కడి సహజమైన, స్వచ్ఛమైన గాలి పీల్చి, తియ్యని నీరు తాగి, ఒక్కసారిగా హైదరాబాదు రావటంతో నన్ను ఎవరో స్వర్గం నుంచి నరకంలోకి తోసిన ట్లనిపించింది. పొట్ట కూటి కోసం ఇక్కడ పడి ఉండటం తప్ప, మనస్ఫూర్తిగా ఈ వాతావరణాన్ని భరించే సహనం బహుశా ఎవ్వరికీ ఉండ దనుకుంటాను.

ఫాన్ వేస్తే తప్ప గాలి రాదు. తలుపు ఒక్క క్షణం తీశామంటే కొన్ని వేల దోమలు పిలవని పేరంటంగా ఇంట్లో వచ్చి వాలుతాయి. ఒక్కొక్క దోమ గండుచీమ సైజులో ఉంటుంది. ఇంజక్షన్ చేస్తే ఒక్క క్షణం మాత్రమే నొప్పి పుడుతుంది. కానీ ఈ దోమ కుట్టిందంటే కొన్ని నిముషాలపాటు కుట్టిన ప్రాంతాన్ని రుద్దుకుంటూ కూర్చోవలసిందే. ఇంట్లో ఉంటే జైలులోఓ ఉన్నట్లు ఉండాల్సిందే.

ఈ దోమల విషయం వచ్చినప్పుడు నా కో జోకు గుర్తుకొస్తుంది. వెనకటి కొకాయన హైదరాబాదు నివాసి ఎవరో ఒక పల్లెటూర్లో చుట్టాలింటికి వెళ్ళాడట. సాయంకాలం వాకిలి ముందు కూర్చుని అందరితో కబుర్లాడుతుంటే ఆయనకు తేలు కుట్టిందట. ఆయన వెంటనే తేలును కాలి మడమతో కసకస నలిపేసి మళ్ళీ కబుర్లలో పడ్డాడట. కూర్చున్నవారంతా అదిరిపడి "తేలు కుడితే మీకు నొప్పిగా లేదా?" అని అడగ్గా, ఆయన పకపక నవ్వి "హైదరాబాదులో రోజూ దోమకాట్లు తినేవాడిని. నాకీ తేలు కాటు ఒక లెక్కా, డొక్కా?" అన్నాడట.

ఇక ఆఫీసుకు వెళ్ళాలంటే క్రిక్కిరిసిన బస్సుల్లో ఫుట్‌బోర్డు మీద కాలి బొటనవేలు ఆధారంగా వేలాడుతూ వెళ్ళాల్సిందే. ఆఫీసు టైమింగ్స్‌లో బస్సులో ఆ మాత్రం చోటు దొరికినా అది పార్లమెంటులో సీటు దొరికినంత గొప్ప అనుకోవాలి. అది కూడా దొరక్క ఆఫీసుకు లేటుగా వెళ్ళి తిట్లు తినే వా రెందరో!

ఇటువంటి నరకంలో ఉంటున్న మాకు, ఈ పల్లెటూళ్ళో జరిగే పెళ్ళి కార్డు రాగానే రంభ, ఊర్వశి, మేనకల్లో ఎవరు గొప్పవారో నిర్ణయించటానికి రమ్మని స్వర్గాధిపతి ఇన్విటేషన్ పంపినంత సంబరం కలిగింది. పైగా వరుడు నా శ్రీమతికి దగ్గర బంధువు. పెళ్ళికి ముందు రోజు బయలుదేరి గుంటూరు వచ్చాము. అక్కడి నుంచి అందరం బస్సులో బయలుదేరాము.

దారి పొడవునా పచ్చని పొలాలు, కాలువలు, చిన్న చిన్న కుగ్రామాలు చూస్తూ వెళుతుంటే మనసు అదో విధమైన ఆనంద డోలికల్లో ఊగులాడింది.

రాత్రి తొమ్మిది గంటలకు ఊరు చేరాము. వధువు తరఫువారు స్వాగతం ఇచ్చారు. విడిదింటికి వెళ్ళి స్నానాలు చేసి భోజనాలకు వెళ్ళాము.

భోజనశాలలో నేలమీద చక్కగా గోనె సంచులు, చాపలు పరిచారు. అరటి ఆకుల్లో భోజనాలు వడ్డించారు.

హైదరాబాదులో ఏదైనా పెళ్ళికో, ఫంక్షన్‌కో వెడితే జరిగే విందు జ్ఞాపక మొచ్చింది. చాలామంది ఇక్కడ 'బఫే' పద్ధతి అనుసరిస్తున్నారు. ఒక టేబుల్ మీద అన్ని పదార్థాలూ ఉంచుతారు. తినవలసిన వారు అడుక్కుతినే వారిలా పింగాణీ ప్లేట్లు చేతిలో పట్టుకుని, కావలసినంత వడ్డించుకుంటూ, పక్కవాళ్ళు ఏమైనా అనుకుంటా రేమో నని దొంగ చూపులు చూస్తూ నిలుచునే తినాలి. తిన్న వారు ప్లేట్లు అక్కడ పడేస్తే వాటిని పైపైన కడిగి మళ్ళీ అక్కడే తెచ్చి పెడతారు. అవే ప్లేట్లలో మరలా వేరేవాళ్ళు తినాలి. ఒకవేళ ఏదైనా పదార్థం రుచిగా ఉన్న దనిపిస్తే మళ్ళీ వేసుకుంటే పక్కవాళ్ళు ఎగతాళి చేస్తా రనే భయంతో భేషజాలకు పోతూ, అర్ధాకలితో బయటపడి, ఇంటికి వెళ్ళేటపుడు ఏ హోటల్లోనో భోం చేసి వెళ్ళాల్సిందే.

మరి కొంతమంది భోజన నిర్వహణ అంతా ఏ హోటళ్ళ వారికో కాంట్రాక్టు ఇస్తారు. వారు తలకు ఇరవయ్యో, పాతికో వసూలు చేసి ఏ పదార్థంలోనూ ఉప్పూ, కారం లేకుండా చప్పగా హోటళ్ళలో చేసినట్లే చేసి, వడ్డింపులు కూడా వాళ్ళే చేస్తారు. పెళ్ళికొచ్చిన వా రెవరూ వారికి తెలియదు. ఎవరి కేం కావాలో అసలు పట్టించుకోరు. వాళ్ళు వడ్డించిందే భాగ్యం అనుకుంటూ తినాల్సిందే. ఒక్కొక్కసారి చెప్పిన సంఖ్య కంటే ఎక్కువ వస్తే, అప్పటికప్పుడు డబ్బు లిస్తేగానీ వారికి అన్నం పెట్టమని హోటళ్ళవాళ్ళు పేచీకి దిగిన సందర్భాలూ లేకపోలేదు. జీవితంలో ఎప్పుడో ఒక్కసారి జరిగే శుభ కార్యానికి వచ్చే బంధుమిత్రులకు వంట చేసి, లేదా చేయించి పెట్టడమే శ్రమ అనుకుంటున్నారు ఈనాటి పట్నవాసులు. విందు ఇచ్చే వా రెవరూ అక్కడ ఉండరు. ఎటువంటి ఆదరణ, ఆప్యాయత మనకు దొరకవు.

కానీ ఇక్కడ అనేకమంది ఆడవారు, మగవారు హుషారుగా అందరినీ వరుసలు పెట్టి పిలుస్తూ కొసరి కొసరి వడ్డిస్తుంటే ఎంతో ముచ్చటేసింది నాకు. కొత్త పాత లేకుండా అందరితో కలివిడిగా మాట్లాడుతూ, భోజన కార్యక్రమాలు వారు నిర్వహించిన తీరు - నా స్మృతిలో చిరకాలం నిలిచిపోయే మరపురాని దృశ్యం.

అందరిలోనూ ఒక యువతి నన్ను విశేషంగా ఆకర్షించింది అంద చందాలతో కాదు. నలుగురూ నాలుగువైపులా 'అది కావాలి, ఇది కావాలి' అని పీక్కు తింటున్నా చిరునవ్వుతో అందరి కోరికలు తీరుస్తున్న ఆమె సహనం. కాస్తో కూస్తో అందంగా కూడా ఉండటంతో కొంతమంది కుర్రవాళ్ళు ఆమెను ఆటలు పట్టిస్తున్నారు. పల్లెటూరి యువతి కావడంతో పుష్టిగా, చాలా ఆరోగ్యంగా ఉన్నది.


శ్రీమతి చేసిన ఎంక్వైరీలో ఆమె వధువు చెల్లెలని, బి.ఏ. చదువుతున్న దని తెలిసింది. ఈమెకూ, వధువుకూ మధ్యలో మరొక కుర్రవా డున్నాడని, అతను బ్యాంక్‌లో జాబ్ చేస్తున్నాడనీ కూడా తెలిసింది.

రాత్రి రెండు గంటలకు ముహూర్తం. భోజనాల తరువాత కొంతమంది చతుర్ముఖ పారాయణంలోకి దిగారు, మరి కొందరు కునుకు తీయసాగారు.

చల్లని గాలి రివ్వున వీస్తున్నది. బయట వెన్నెల పిండారబోసినట్లున్నది. నేను నిండు జాబిల్లిని చూస్తూ, అతనిస్తున్న చల్లదనాన్ని అనుభవిస్తూ ఆనందిస్తున్నాను.

మేఘాలు మెల్లగా కదులుతూ చందమామతో దాగుడుమూత లాడుతున్న దృశ్యం నన్ను పరవశుడిని చేసింది.

తెలియకుండానే సమయం ఒకటిన్నర అయింది. మా ఆవిడ నన్ను వెతుక్కుంటూ వచ్చి ముహూర్తం టైం గుర్తు చేసింది.



## చదువులు

లఘువులై పోతున్నారు గురువులు
విల్లంబులౌతున్నారు విద్యార్థులు
ఎవరు ఏమైతే నేం గాని -
లక్షలు పోసి సలక్షణంగా చదువుకొంటున్నారు
అవును చక్కగా చదువు కొంటున్నారు.

- కరుణశ్రీ

ముఖం కడుక్కుని ఫ్రెష్‌గా తయారై వివాహ వేదిక ముందు వేసిన కుర్చీల్లో కూర్చున్నాము. ఒక్కొక్కరే మెల్లగా వస్తున్నారు. ఇంతలో ఇందాక నేను చూసిన యువతి, ఆమె అన్నయ్య, మరి కొంతమంది కుర్రవాళ్ళు కాఫీ ట్రేలతో ప్రత్యక్షమయ్యారు. అందరికీ హుషారుగా అందించసాగారు। వాళ్ళ చాకచక్యం, ఓపిక నన్ను ముగ్ధుడిని చేసింది.

అనుకున్న ముహూర్తానికి వివాహం నిర్విఘ్నంగా జరిగిపోయింది. అందరూ ఆశీర్వదించి కానుక లిచ్చారు.

నేనూ, శ్రీమతి విడిదింటికి వెళ్ళి పడుకున్నాము. రెండు గంటలు పడుకోగానే తెల్లవారింది.

ముఖం కడుక్కుంటూ శ్రీమతిని కదిలించాను - "మా పిన్ని కొడుక్కి వధువు చెల్లెలు బాగా సూటవుతుంది. కనుక్కుందామా?" అన్నాను.

"ఎక్కడి కొచ్చినా మీకు సంబంధాల గొడవేనా? ఆడపిల్లను చూస్తేనే మీకు పెళ్ళి జ్ఞాపక మొస్తుంది" అన్నది నవ్వుతూ.

"పిల్ల మంచి ఓర్పు, పనితనం గలదానిగా కనిపిస్తున్నది. మా పిన్నికి పనిలో చేదోడు వాదోడుగా ఉంటుంది. త్వరగా కలిసిపోయే రకంలా ఉన్నది. ఏమంటావు?" అన్నాను.

"ఊఁ మీ వర్ణనలు బాగానే ఉన్నాయి. అడిగి చూడండి". అన్నది.

జానకమ్మ అని నాకు వరసకు పిన్ని అయ్యే బంధువు ఒకామె ఉన్నది. చిన్నతనంలోనే వైధవ్యం ప్రాప్తించగా ఉన్న ఒక్క కొడుకు, కూతురును ఏదో వంటావార్పులు చేసుకుంటూ డిగ్రీ వరకు చదివించింది. కొడుకు ఒక ప్రైవేట్ కంపెనీలో రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. వాడికి గవర్నమెంట్ జాబ్ వస్తే తమ కష్టాలు గట్టెక్కుతాయని ఆశపడుతున్నారు.

కూతురు పెళ్ళికి రెడీగా ఉన్నది. కట్నం నాలుగైదు వేలకు మించి ఇవ్వలేననీ, ఏవైనా సంబంధా లుంటే చూడమనీ నాతో చాలాసార్లు అన్నది.

అయితే ఈ అమ్మాయి నాకు బాగా నచ్చడంతో ముందు మా పిన్ని కొడుక్కి సెటిల్ చేద్దా మనుకున్నాను.

మధ్యాహ్నం భోజనాలయిన తరువాత వధువు తండ్రితో ఈ విషయం ప్రస్తావించాను.

"కూర్చోండి" అన్నాడు కుర్చీ చూపుతూ.

ఇద్దరం ఎదురెదురుగా కూర్చున్నాము.

"మా అమ్మాయి మీ అభిమానం చూరగొన్నందుకు నాకు చాలా సంతోషంగా ఉన్నది. అయితే పరిస్థితి చూస్తున్నారుగా! ఈ కార్యానికి అన్నీ కలుపుకుని యాభై వేల వరకూ ఖర్చయింది. నేనూ మధ్య తరగతి జీవినే. ఈ దెబ్బ నుంచి కోలుకోవటానికి నాకు కనీసం రెండు మూడు సంవత్సరాలు పడుతుంది. అప్పుడైనా ఐదారు వేలకు మించి కట్నం ఇవ్వలేను. దానికి డిగ్రీ చెప్పిస్తున్నాను. ఆడపిల్లలకు చదువులు చెప్పించేది కట్నం కొంచెమైనా తగ్గుతుందని ఆశతోనే కదా!" అన్నాడు.

ఆయన మాటలు కొంత నిరాశను కలిగించాయి. మరీ అంత తక్కువ కట్నానికి మా పిన్ని అంగీకరిస్తుందో, లేదో? ఒకవంక అమ్మాయిని వదులుకోబుద్ధి కావటం లేదు. కానీ ముడిపడుతుందన్న నమ్మకం కలగటం లేదు.


"సరే. చూస్తాను లెండి" అని లేచి తరువాత జరిగిన విషయం శ్రీమతితో చెప్పాను.

"మరీ అంత తక్కువ కట్నానికి మీ పిన్ని అంగీకరిస్తుందా? మిగిలే దేమీ లేకపోయినా కనీసం ఖర్చులైనా వెళ్ళాలిగదా. పోనీ, మీ పిన్ని కూతురుకు సంబంధం చూడండి - పెళ్ళికూతురు తమ్ముడున్నాడు కదా! పైగా అతను మంచి జాబ్ కూడా చేస్తున్నాడు అడక్కపోయారా?" అన్నది.

అవును. మరిచేపోయాను. ఈ అమ్మాయి విషయమే ఆలోచిస్తూ ఆ సంగతి మరిచాను. మా పిన్ని తొందరంతా ఆడపిల్ల పెళ్ళి గురించి కానీ, కొడుకు గురించి కాదు కదా! సమయానికి మంచి సలహా ఇచ్చి 'కార్యేషు మంత్రి' అనిపించుకున్నందుకు బహుమతిగా ఒక ముద్దిచ్చి మరలా ఒక అవకాశం కల్పించుకుని వధువు తండ్రిని కలిశాను.

"ఇందాక అడగటం మరిచాను. ఏమీ అనుకోకండి. మా పిన్నికి ఒక కూతురున్నది. పిల్ల చక్కగా ఉంటుంది. డిగ్రీ పాసయ్యింది. వాళ్ళు కూడా చాలా పేదవారు.

# గూర్ఖా



సాయం సంధ్యని భుజాని కెత్తుకుని
చుక్కల చెట్టెక్కుతున్న విక్రమార్కుడా
నువ్వుత్త నెల జీతగాడివేనా?
భ్రమలు విడిచీ బంధుత్వాలు విడిచీ
అర్ధరాత్రి గడప దాటిన సిద్ధార్థుడా
నువ్వుత్త పహరా హుషారువేనా !?

★

ఖండిత సర్పంలా పెనగుతున్న రోడ్లమీద
తారట్లాడిన జాలి మబ్బుతునకా
నువ్వుత్త పాదచారివేనా?
మసక లేని మా రాత్రులకోసం
ఇసక పరచిన నేత్రమా
నువ్వుత్త ఖాకీ యూనిఫారానివేనా?

★

భయం చిమ్మిన పొగలు దులిపి కలల జింకలు చేతి కిచ్చిన
అకలుషిత ప్రపంచమా
నువ్వుత్త తుపాకి బోయ్‌నెట్‌వేనా?
చల్లారని చలికి తెల్లారని అలసట జోడిస్తూ
చెట్టు చెట్టుకీ ఆకుపచ్చదనం అద్దిన పచ్చివగరు పత్రమా
నువ్వుత్త లాఠీ చప్పుడువేనా?
ప్రమాదాల వడగళ్ళకి ప్రమోదాల ఉరవళ్ళకి
చేయడ్డు పెట్టిన సువిశాల ఛత్రమా
నువ్వుత్త చెమటవాన చుక్కలేనా?


★

హామీల్లేని మినహాయింపుల్లేని
నీ తల్లికీ, నువు తల్లిని చేసిన పాలవెల్లికీ
మొగ్గ తొడిగిన జూకా మల్లికీ, కాళ్ళకు చుట్టుకున్న నల్లపిల్లికీ దూరంగా
ఏ కూడలిలో నిన్ను నువు పారేసుకున్నావో
మెతుక్కోసం నీ యిందరి బతుక్కోసం-
మనసులాగానే ముడుచుకున్న మా రగ్గుల్లోంచి ఒక్క చెయ్యీ
కరచాలన మివ్వదు
బదులైనా పలకదు

★

ఉప్పు లేని మా ఉత్తుత్త కబుర్లు చూసి
ని న్నానవాలు పట్టలేని మా క్షేమ రాజ్యాల కేసి
వగటిపూట పొరపాట్న కూడా రావొద్దు సుమా
'సలాంలేఖుం' చెబుతున్న నీ అపరిచిత రూపానికి
పావలా ఎక్కువో తక్కువో అర్థంకాక తలకిందు లవుతాం

– కొండేపూడి నిర్మల



నాలుగైదు వేలకు మించి కట్నం ఇచ్చుకోలేరు. అమ్మాయి మీతో కలిసిపోతుంది. మీ అబ్బాయి మంచి ఉద్యోగంలో ఉన్నాడు కదా. అమ్మాయి నచ్చితే మీ అబ్బాయికి చేసుకుంటారా?'' అడిగాను.

చిన్నగా నవ్వా డాయన. "చూడండి మాస్టారూ! వయసులో చాలా చిన్నవారైనా ఒక శుభకార్యం జరిపించా లనే మీ పెద్ద మనసుకు చాకు చాలా సంతోషంగా ఉన్నది. కానీ చూడండీ! మా అబ్బాయికి అతి చిన్న వయసులోనే బ్యాంక్‌లో జాబ్ దొరికింది. వాడి కింకా ముప్పై ఆరేళ్ళ సర్వీసున్నది. ఈ రోజుల్లో వారి కున్న జీతాలూ, సౌకర్యాలూ ఎవరి కున్నాయి చెప్పండి? బరువు బాధ్యత లేమీ లేవు. మమ్మల్ని పోషించవలసిన పని లేదు. కాస్తో కూస్తో ఆస్తి వస్తుంది. మొన్ననే హైదరాబాద్ నుంచి ఒక సంబంధం వచ్చింది. అమ్మాయి కూడా జాబ్ చేస్తున్నదట. యాభైవేలు ఇస్తామన్నారు. నేను ఎనభై అడిగాను. ఆలోచించి చెపుతామని వెళ్ళారు. ఎలా చెప్పండి?'' అన్నాడు.

ఆయన రెండు నాలుకల విధానానికీ, దురాశకూ నాకు మండు కొచ్చింది.

కూతురికైతే ఐదారు వేలకు మించి ఇవ్వడట! కొడుక్కి మాత్రం ఎనభై వేలు కావాలట! అవతల వారి సొమ్మంటే ఎంత చులకన!

ఇ దేం కుదిరేది కా దనిపించింది. అయినా ఈయన పిల్లల పెళ్ళిళ్ళు అయితే ఏం కాకపోతే ఏం? నా దేం పోయింది? అందుకే ఆ టాపిక్ ముగించాను.

సాయంత్రం నాలుగు గంటలకు అప్పగింతలు ముగిశాయి. అందరం తిరిగి గుంటూరు వచ్చి మరునాడు ఉదయం శ్రీమతితో సహా స్వగ్రామానికి వెళ్ళాను.

రెండు రోజుల తరువాత పొరుగూరులో ఉన్న మా పిన్నిగారింటికి వెళ్ళాను.

"అమ్మాయి కేమైనా సంబంధాలు చూశావట్రా?'' అడిగింది పిన్ని.

"మొన్న పెళ్ళికి వెళ్ళినప్పుడు ఒక సంబంధం చూశాను పిన్నీ! కానీ వాళ్ళకు కట్నం ఆశ మరీ ఎక్కువగా ఉన్నది. మనకు అందుబాటులో లేదు'' అన్నాను.

పిన్ని నిట్టూర్చింది. "నా శక్తేమిటో నీకు తెలుసు గదరా! అయినా ఈ రోజుల్లో పెళ్ళి కొడుకు లలా ఉన్నారు. దేనికైనా కాలం కలిసి రావాలి'' అన్నది.

ఇంతలో నేను పెళ్ళిలో చూసిన అమ్మాయి గుర్తుకొచ్చింది. "ఓ మంచి అమ్మాయిని చూశాను పిన్నీ. పిల్ల బాగానే ఉన్నది. మంచి పనిమంతురాలు. నీకు తగిన కోడలవుతుంది. మనవాడికి చేయరాదూ?'' అన్నాను.

"కట్నం ఎంతిస్తారట?'' అడిగింది పిన్ని.

"అయిదారు వేలు ఇవ్వగలరట. అయినా కట్నం దేముంది? అటువంటి పిల్ల దొరకటం చాలా కష్టం. మనవాడు ఆ అమ్మాయితో సుఖపడతాడు'' అన్నాను.

"వాడి కిప్పుడు పెళ్ళికి తొంద రేముందిలేరా! అయినా ఈ రోజుల్లో మగపుట్టుక ఉంటే చాలు. ముందూ, వెనుకా ఏమీ లేకపోయినా వేలకు వేలు ఇస్తున్నారు. అటువంటిది వీడు ఉద్యోగం చేస్తున్నాడు. రే పేదైనా గవర్నమెంట్ జాబ్ వస్తే ఎవరైనా లక్ష రూపాయ లిచ్చి కళ్ళకద్దుకుంటారు. అప్పుడు చూద్దాంలే'' అన్నది పిన్ని.

నేను నిరుత్తరుడి నయ్యాను. ★